# చర్లపల్లి సెంట్రల్ జైలు ప్రాంగణంలో పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి


**- కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మొసలి శ్రీనివాసరెడ్డి**







**చర్లపల్లి, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి సెంట్రల్ జైలు ఆవరణలో సందర్శకులకు సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మొసలి శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జైలుకు ఖైదీలను కలిసేందుకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుండగా, వారి వాహనాలను నిలిపే ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేయవలసి వస్తుందన్నారు. దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతూ, ప్రమాదాలకు అవకాశం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పేరుకే ఇది పెద్ద సెంట్రల్ జైలు అయినప్పటికీ, సందర్శకుల కోసం కనీస పార్కింగ్ సదుపాయం లేకపోవడం బాధాకరమన్నారు. రోడ్డుపై వాహనాలు పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రత్యేకించి ప్రముఖుల సందర్శనలు, సభలు, సమావేశాలు, ముఖ్యమైన సందర్భ దినాల్లో రద్దీ మరింత పెరుగుతుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వాహనాలను దూరంగా నిలిపి నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానికులు కూడా ఇదే సమస్యను ప్రస్తావిస్తూ, జైలు పరిసరాల్లో రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. అత్యవసర సేవలకు చెందిన వాహనాలు కూడా వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు స్పందించి, చర్లపల్లి సెంట్రల్ జైలులో సందర్శకుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. జైలు ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తీసుకుని, సక్రమ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# బసవేశ్వరుడు చూపిన సమానత్వ మార్గమే ఆదర్శం -- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్






**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :గాజుల రామారం డివిజన్ పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీలో శ్రీ బసవేశ్వర మైత్రి సేన, కర్ణ భక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బసవేశ్వర మహారాజ్ 893వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్ పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బసవేశ్వరుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మనిషి జాతి అంతా ఒక్కటేననే గొప్ప భావనతో జీవించిన మహానుభావుడు బసవేశ్వరుడన్నారు. ఆయన చూపిన సమానత్వ మార్గంలోనే ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపు నిచ్చారు. సమాజంలో భేదాభిప్రాయాలు లేకుండా అందరూ సమానంగా జీవించే విధంగా బసవేశ్వరుడి సిద్ధాంతాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణభక్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసా సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు, కోశాధికారి తమ్మా రామచంద్ర మూర్తి, ముఖ్య కార్యదర్శి తాడిశెట్టి జయచంద్ర మోహన్, సహాయ కార్యదర్శులు సమతం భీమేశ్వరరావు, తాడిశెట్టి శ్రీనివాస్ (వాసు), మాజీ కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, వీరయ్య చౌదరి, చిన్నా చౌదరి, సాయిబాబా, శివా నాయక్, పి. గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డికి ఘనంగా సన్మానం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సాయిబాబా నగర్ డివిజన్‌కు చెందిన సోమన్నగారి శ్రీధర్ రెడ్డిని సోమవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్ఆర్ నాయక్ నగర్ కు చెందిన మహిళా కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షురాలు నాగ శిరోమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్రీధర్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగ శిరోమణి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రీధర్ రెడ్డి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో ఆయనకు లభించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన పేద ప్రజలకు అందజేస్తూ జిల్లాలో పార్టీని మరింత పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ఎస్ సీ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీలు





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్ సీ అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ కళాశాల, కళాశాల బాలికల హాస్టల్, కాప్రా కళాశాల బాలుర హాస్టల్‌లను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, పారిశుధ్యం, త్రాగునీటి సౌకర్యం, విద్యా వాతావరణం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, కొన్ని అంశాల్లో మరింత మెరుగుదల అవసరమని సూచించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన వినోద్ కుమార్, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. భోజన నాణ్యతను మెరుగుపరచడం, సమయానికి ఆహారం అందించడం, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే హాస్టల్ రికార్డులు, హాజరు నమోదులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# వేసవిలో విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :వేసవి కాలంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కాంతమ్మ జిల్లా అధికారులను కోరారు. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని, శుభ్రమైన ఆహారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే గదులు, వంటశాలలు, బాత్రూములు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు సరైన గాలి ప్రసరణ, నీడ, తగిన విశ్రాంతి కల్పించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైనప్పుడు వెంటనే వైద్యసహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని కాంతమ్మ ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేశారు.

# ఎస్ఎన్‌డీపీ పనుల్లో భారీ అవకతవకలు

**- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు**



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ సర్కిల్ పరిధిలో చేపట్టిన వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజనకు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. 2021-2024 కాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వర్షపు నీటి కాలువల అభివృద్ధి కోసం సిమెంట్ బాక్స్ డ్రెయిన్ల నిర్మాణానికి ఎస్ఎన్‌డీపీ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పట్టణాభివృద్ధి శాఖ 2020 అక్టోబర్ 2న విడుదల చేసిన జీఓ నెంబర్ 570 ప్రకారం ఈ పనుల చెల్లింపులు జీహెచ్ఎంసీ ద్వారా జరగాల్సి ఉంది. నిజాంపేట్ సర్కిల్‌లో మొత్తం రూ. 84 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టులు చేపట్టగా, వాటిలో కేవలం 6 పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగతా 3 ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాపయ్య కుంట నుంచి సిరి బాలాజీ వరకు రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు ప్రారంభించకుండానే కాంట్రాక్టర్ సుధాకర్‌కు చెల్లింపులు జరిగినట్లు ఆరోపించారు. భవ్యాస్ ఆనంద్ నుంచి లేక్ రెడ్డి వరకు రూ. 4.68 కోట్ల పనులు సగం మాత్రమే పూర్తయ్యాయని, మిగతా భాగం పెండింగ్‌లో ఉందని తెలిపారు. అలాగే కేజీ ఎన్ క్లేవ్ నుంచి ఒక కోలా కంపెనీ వరకు రూ. 55.46 కోట్ల పనులు కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. చేసిన పనుల్లో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, పలు ప్రాంతాల్లో పనులు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆకుల సతీష్ ఆరోపించారు. పెద్ద చెరువు, కౌసల్య కాలనీ, ఎస్‌కేఎన్ విల్లాస్ ప్రాంతాల్లో పనులు ప్రారంభించలేదని వివరించారు. పనులు పూర్తి కాకపోవడంతో మురుగునీటి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాబోయే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా పనులు పూర్తికాకపోయినా ప్రజాప్రతినిధుల ఒత్తిడితో సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ. 30 కోట్ల చెల్లింపులు జరిగాయని ఆరోపించారు. ఈ అంశంపై విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదులో అరుణ్ రావు, చంద్రశేఖర్, అంతం సతీష్, ఎల్ల స్వామి, పాండు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు





**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు సోమవారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని సౌత్ కమలానగర్ మెయిన్ రోడ్డుపై నూతన జెండా దిమ్మె వద్ద తెలంగాణ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సృష్టికర్త, విజనరీ నాయకుడు, సైబరాబాద్ రూపశిల్పి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా సేవలు అందించారని కొనియాడారు. నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా 2014--2019 కాలంలో సేవలందించి, ప్రస్తుతం కూడా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. చంద్ర బాబు నాయుడు దూరదృష్టి, పరిపాలనా నైపుణ్యం దేశానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎందరికో మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, సీనియర్ నాయకులు కొమ్ము ఉపేందర్, గోబేరు రమేష్, మత్తి వెంకట్ నాయుడు, యుండూరి వెంకటేశ్వరావు, రవి, మురళి, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రాలో కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం





**కాప్రా, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :కాప్రాలోని చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం సంప్రదాయ పద్ధతుల్లో, భక్తి భావంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా సోలిస్ కంటి ఆసుపత్రి చైర్మన్ నందనంపాటి రామాంజనేయులు ఆలయ కార్యక్రమాల కోసం వంట సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, స్వర్ణ రాజు శివమణి జె. కృష్ణమాచార్యులు, ఈఓ, కమిటీ సభ్యులు పొట్టు బాబురావు, పడమటి మల్లారెడ్డి, ఉప్పల వినోద్ కుమార్, ఓర్ల శ్రీధర్ రెడ్డి, గూడ సత్యనారాయణ, పబ్బారి నరేందర్ గౌడ్, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ టి. శ్రీనివాస్, శంకర్ బాబు, గజేందర్ రెడ్డి, ముకేష్, మోహన్, విశ్వం, విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల కొనసాగింపుగా మంగళవారం సుదర్శన హోమం, చక్ర స్నానం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



# ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :మేడ్చల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన బసవేశ్వరుని సమానత్వ భావన, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి(రెవిన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసి) శ్రీమతి ఆర్ఎస్. చంద్రావతి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీరాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ తదితర జిల్లా అధికారులు పాల్గొని మహాత్మా బసవేశ్వరుని సేవలను కొనియాడి నివాళులు అర్పించారు.

# ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో వేసవి కాలాన్ని పురస్కరించుకుని ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తెలిపారు. ఈ శిబిరాలు ఏప్రిల్ 24 నుంచి జూన్ 7 వరకు బాలబాలికలకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. వివిధ క్రీడా విభాగాలలో నిపుణులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణ పొందదలచిన విద్యార్థులు తమ ఆధార్ కార్డు, పాఠశాల వివరాలు, ఇతర అవసరమైన పత్రాలతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెండవ అంతస్తు, గది నంబర్ 8లో ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో ఏప్రిల్ 22లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

